మానవత్వాన్ని చాటుకున్న కుప్పం 108సిబ్బంది

మృతదేహాన్ని తీసుకొస్తున్న సీనియర్ జర్నలిస్ట్, 108 సిబ్బంది, రైల్వే పోలీసు

ప్రజాశక్తి-కుప్పం రూరల్: ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దుల్లో కుప్పం మండలం మల్లానూరు రైల్వేస్టేషన్ సమీపంలో దట్టమైన అడవి ఓవైపు, 60 అడుగుల లోతు మరోవైపు లోయ ఆ ప్రాంతం పేరు పులిగుండు. రెండు బండరాళ్ళ మధ్య కుప్పం నుంచి చెన్నై వైపు వెళ్ళు రైలు పట్టాలు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి కొనఊపిరితో కొట్టు మిట్టాడుతున్నాడని శుక్రవారం 108 అంబులెన్సుకు, రైల్వే పోలీసులకు ఫోన్ వచ్చింది. హుటాహుటిన 108 అంబులెన్స్ రాష్ట్ర సరిహద్దులోని అటవీ ప్రాంతానికి వెళ్ళింది. అదే సమయంలో రైల్వే పోలీసులు, సీనియర్ జర్నలిస్టు లక్ష్మీనారాయణ రాష్ట్ర సరిహద్దులోని అటవీ ప్రాంతానికి పరుగులు తీశారు. అయితే ఎవ్వరూ అక్కడికి వెళ్లేందుకు సాహసం చేయలేకపోయారు. ఎందుకంటే అక్కడ సెల్ ఫోన్లు పనిచేయవు. చివరకు 108 డ్రైవర్ చంద్రశేఖర్, టెక్నీషియన్ గిరి, సహాయకుడు సుబ్రమణ్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని 60అడుగుల ఎత్తులో ఉన్న రైలు పట్టాలపైకి వెళ్లేందుకు సాహసించారు. పడుతూ లేస్తూ ఎలాగోలా రైలు పట్టాలపైకి చేరుకున్నారు. అయితే అక్కడ వ్యక్తి పడిన జాడ లేదు. చివరకు ఓ బండరాయి పక్కన చెట్ల నడుమ గుర్తుతెలియని వ్యక్తి పడిఉన్నాడని గుర్తించి పరీక్షించారు. అయితే అప్పటికే అతను మృతి చెందాడు. వెనుకనే అష్టకష్టాలు పడుతూ ప్రమాదస్థలానికి మరికొందరు చేరుకున్నారు. అయితే మృతదేహాన్ని అక్కడి నుంచి ఎలా తీసుకెళ్లాలనే యోచన.. చుట్టుపక్కలా ఎవరులేరు.. ఓవైపు దాహం.. 108 సిబ్బంది సహాయంతో సుమారుగా ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న అంబులెన్స్ వద్దకు మృతదేహాన్ని తరలించారు. తరలించే క్రమంలో ఎక్కడ రైలు వస్తుందోనని, క్రూరమృగాలు, ఏనుగులు వస్తాయోనని భయాందోళనతోనే స్ట్రేచర్లో మృతదేహాన్ని మోసుకెళ్లి, పలుమార్లు దించి, సుమారు రెండు గంటల సమయం తరువాత ప్రధాన రహదారికి చేరుకున్నారు. మానవత్వాన్ని చాటుకున్న 108 సిబ్బంది, సీనియర్ జర్నలిస్ట్ లక్ష్మీనారాయణను పలువురు అభినందించారు.

ఎస్ఎన్‌జే డిస్లరీలో సిఐడి సోదాలు

- పలు రికార్డులు స్వాధీనం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని నెళవాయి వద్ద చిత్తూరు – పుత్తూరు రోడ్డు పక్కన ఉన్న ఎస్ఎన్‌జె షుగర్ ఫ్యాక్టరీ డిస్లరీ విభాగంలో ఏపీ సిఐడి బుధవారం ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు సిఐడి డిఎస్పి పద్మలత ఆధ్వర్యంలో దాదాపు 15మంది సిబ్బందితో సోదాలు నిర్వహించారు. గత ప్రభుత్వంలో డిస్లరీ సంబంధించి అనేక స్కాములు బయటపడడంతో బుధవారం మండలంలో నిర్వహించిన సోదాలుపై పలువురు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. మాజీ డిప్యూటీ సీఎం అప్పటి ఎక్సైజ్ శాఖ మంత్రి సొంత నియోజకవర్గంలో ఉన్న ఈ ఎస్ఎన్‌జే ఫ్యాక్టరీలో గత ఐదు సంవత్సరాల్లో ఎస్ఎన్‌జె డిస్లరీ విభాగంలో పలు అక్రమాలు జరిగినట్లు ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఆ ప్రభుత్వంలో చర్యలు తీసుకోకపోగా ప్రభుత్వం మారిన తక్షణం లిక్కర్ కుంభకోణం బయటపడడంతో నియోజకవర్గం లోనే కాకుండా జిల్లాలో పలువురు ముఖ్యమైన వైసీపీ నాయకుల్లో దడ మొదలైంది. గత ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఉన్న నారాయణస్వామి ఇలాకాలో ఉన్న ఎస్ఎన్‌జె డిస్లరీలో సిఐడి సోదాలు నిర్వహించడంతో ఇది ఎక్కడికి దారితీస్తుందో అని చర్చగా మారింది.



సోదాలు నిర్వహిస్తున్న సీఐడీ అధికారులు

117 జీవోను రద్దు చేయాలి: యూటీఎఫ్

యూటీఎఫ్ నాయకుల సమావేశం

ప్రజాశక్తి-తవణంపల్లి: 117 జీవోను రద్దు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఐరాల క్రాస్ రోడ్డు వద్ద ఎంపీపీ పాఠశాలలో మండల సమావేశం నిర్వహించారు. యూటీఎఫ్ ఆవిర్భవించి 50వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగారాజు హాజరైయ్యారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ యూటీఎఫ్ 50వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేస్తూ.. 117జీవోను రద్దు చేసి ప్రాథమిక పాఠశాల బలోపేతానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ తరువాత మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. మండల గౌరవ అధ్యక్షులు మునస్వామి, అధ్యక్షులు రాజేష్ కుమార్, ఉపాధ్యక్షులుగా శేఖరయ్య, మమత, ప్రధాన కార్యదర్శిగా పెద్దబ్బ రెడ్డి, కోశాధికారిగా చిరంజీవి, కార్యదర్శులు నిరంజన్ రెడ్డి, అరుణాచలం, గీత, ఆడిట్ కమిటీ కన్వీనర్ వెంకటరమణ జిల్లా కౌన్సిల్, రాజేష్ కుమార్, పెద్దబ్బరెడ్డి, సురేష్ బాబు, శైలజను ఎన్నుకున్నారు.

వామ్మో చిరుత.!

- వణికిపోతున్న అటవీ సరిహద్దు ప్రాంతాలు
- జీవాలపై వరుస దాడులు
- పొలాల వద్ద బెంబేలెత్తిపోతున్న రైతులు
- కలవరపెడుతున్న చిరుతల సంచారం

ప్రజాశక్తి-సోమల: కౌండిన్య అడవుల్లో చిరుతలు సంచారం అధికమైందనే చెప్పాలి. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో చిరుతలు పెద్దగా లేవని అటవీ అధికారులు చెబుతూ వచ్చారు. సంఖ్యా పరంగా వాటి సంచారం పెరిగింది. అందుకు పలు ఉదాహరణలు ఉన్నాయి.. ఇటీవల కాలంలో చిరుతలు కౌండిన్య అటవీ సరిహద్దు ప్రాంతాల్లో వేర్వేరు కారణాలతో చిరుతలు మృత్యువాతపడ్డాయి. గడిచిన నాలుగేళ్లలో దాదాపు ఐదు చిరుతలు మృతి చెందినట్లు కొన్ని సంఘటనల్లో తేలింది.

- బంగారుపాళ్యం మండలంలో వేటగాళ్ల ఉచ్చుకు చిక్కిన ఓ చిరుతను తిరుపతి జూపార్కుకు తరలించగా అక్కడ ఆ చిరుత చికిత్స పొందుతూ మృతి చెందింది.
- గతంలో కౌండిన అడవి (తమిళనాడు సరిహద్దులో) చిరుత మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు.
- గత మూడున్నరేళ్ల కిందట పెద్దపంజాణి మండలంలో మరో చిరుత మృతి చెందింది.
- ఇటీవల సోమల మండలం పెద్ద ఉప్పరిపల్లి అటవీ ప్రాంతంలో చిరుత మృతి చెంది ఉండడాన్ని మేకల కాపరులు గుర్తించారు.
- యాదమరి మండలంలో వేటగాళ్ల ఉచ్చులో ఇటేవలే మరో చిరుత బలైంది.

అటవీ పరివాహక ప్రాంతాల్లో భయం.. భయం!

కౌండిన అటవీ పరివాహక ప్రాంతాల్లో పశువులు, జీవాల కాపరులు చిరుతల సంచారంతో బెంబేలెత్తిపోతున్నారు. వరుస ఘటనలతో భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రిల్లో పొలాల వద్దకు కాపలా వెళ్లాలన్నా.. ఒంటరి ఉండాలన్న చిరుతలు సంచారంతో కలవరపాటుకు గురవుతున్నారు. ఎటువైపు నుంచి ఏ ప్రమాదం పొంచి ఉందోనన్న ఆందోళనలో రైతులు ఉంటున్నారు.

జీవాలపై వరుస దాడులు

- గత నెల 25న పుంగనూరు పట్టణ సమీపంలో చిరుత సంచరించిందని దుమారం రేగింది. స్థానిక రైతులు గుర్తించగా అటవీ అధికారులు అక్కడి ప్రదేశాన్ని పరిశీలించారు.
- చౌడేపల్లి మండలంలోని కరణంవారిపల్లిలో గత నెల 22న చిరుత సంచరిస్తున్నట్లు గ్రామానికి చెందిన ఓ మహిళ గుర్తించింది. చిరుత వెంబడి పిల్లలు కూడా ఉన్నట్లు అడుగులు గుర్తించినట్లు గ్రామస్తులు తెలిపారు.
- గత నెల 31న(గురువారం) నిమ్మనపల్లి మండలం, చల్లావారిపల్లి సమీపంలోని బోడికొండకు సమీపంలో రైతు ఆదన్నకు చెందిన పశువుల షెడ్డులోని లేగదూడపై చిరుత దాడి చేసి చంపేసింది. ఆ ఘటనను పరిశీలించిన అటవీ అటవీ అధికారులు చిరుత దాడి చేసినట్లు నిర్ధారించారు.
- గత నెల 29న(మంగళవారం) రాత్రి సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బాల రాజయ్యకు చెందిన ఆవును సమీప అటవీ ప్రాంతంలో చిరుత దాడి చేసింది. సమయానికి రైతు గుర్తించడంతో ఆవు గాయాలతో ప్రాణాపాయం నుంచి భయటపడింది.

చిరుతలను కాపాడడం అందరి బాధ్యత

చిరుతలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అయితే చిరుతలు గ్రామాల్లోని జీవాలు, పశువుల నెత్తురు మరిగి వరుస దాడులు చేపడుతున్న వేళ మరింత అప్రమత్తత అవసరం ఉంది. ఒక వైపు వేటగాళ్ల నుంచి చిరుతలను కాపాడాల్సిన అటవీ అధికారులు, గ్రామాల్లోకి రాకుండా చూడాల్సిన చర్యలు చేపట్టాల్సి ఉందని అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు అంటున్నారు. ఊళ్లలోకి రాకుండా చూడాలని, ఆ మేరకు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుకుంటున్నారు.

సోమల: చిరుత దాడిలో తీవ్ర గాయాలపాలైన ఆవు

నిమ్మనపల్లిలో చిరుత దాడిలో మృతి చెందిన దూడ

పెద్ద ఉప్పరపల్లి అడవిలో మృతి చెందిన చిరుత

గ్రామాల్లో అవగాహన కల్పిస్తాం..

చిరుత సంచారమా.. హైనా అన్న విషయాలను పరిశీలిస్తున్నాం. చిరుత సంచారం.. అటవీ వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అందులో భాగంగా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. ఏదైనా ఇబ్బంది ఉంటే సమాచారం ఇవ్వాలి. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నాం.

- శ్రీరాములు, అటవీ రేంజ్ అధికారి, పుంగనూరు

మహిళాభ్యున్నతికి కూటమి కృషి



ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

- ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం
- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళల సేవలో దీపం పథకం పేరిట ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని గుడిపాల మండలం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు, జీడి నెల్లూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, డాక్టర్ వీఎం థామస్, కలికిరి మురళీ మోహన్‌లకు మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంలో భాగంగా దీపం-2 పథకంలో ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం పేద ప్రజలకు అందించనున్నది. ఈ పథకం కింద గ్యాస్ బుక్ చేసుకొనే లబ్ధిదారులకు సిలిండర్‌కు వెచ్చించిన సొమ్ము వారి వ్యక్తిగత ఖాతాలకు 48గంటల్లో జమకానున్నాట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 5,43,202 తెల్ల రేషన్ కార్డులు ఉండగా.. ఇప్పటి వరకు దీపం కనెక్షన్లు 2,44,546, ఉజ్వల్ కనెక్షన్లు 12,268 మొత్తం ఎల్పిజి కనెక్షన్స్ 5,80,297,47 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, మేయర్, దొరబాబు, ఎఎస్ మనోహర్, గాంధీ, కఠారి హేమలత, అధికారులు జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, డిఎస్‌వో శంకరన్, గుడిపాల తహశీల్దార్, ఎంపిడివో చంద్రశేఖర్ రెడ్డి, శివరాజ్, నాయకులు సీఆర్ రాజన్, కోదండయ్య, అట్లూరి శ్రీనివాసులు, హేమాద్రి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండల కేంద్రంలో శుక్రవారం దీపం-2 పథకంలో గ్యాస్ కనెక్షన్ ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, ఝాన్సీ, భాస్కర్ నాయుడు, సిద్దయ్య శెట్టి, మునివర్ధన్ నాయుడు, రుద్రప్ప నాయుడు, జీవన్ కుమార్, గురునాథం, కుమార్, ఎస్ఐ సుమన్, తహశీల్దార్ లోకనాథ పిళ్ళై, ఎంపీడీవో మోహన్ మురళి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కుప్పం రూరల్: కుప్పం తంబిగానిపల్లి ప్రాంతంలో ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం శుక్రవారం ప్రారంభించారు.

పలమనేరు: మున్సిపల్ పరిధిలోని గంటావూరులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన దీపం-2 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో భవాని, తహశీల్దార్ ఇన్బనాథన్, కమిషనర్ రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊరు గాని ఊళ్లో..

వలసల బతుకు పోరు

వారిది రెక్కాడితే గాని డొక్కాడని బతుకు.. రాయలసీమ జిల్లాల్లో గత మూడేళ్లుగా కరువు రక్కసి తాండవించడంతో వేసిన పంట చేతికి రాక, అప్పు తీర్చుకునేందుకు బెంగుళూరు, తిరుపతి, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లిన వలస కూలీల పరిస్థితి దయనీయం. పండగ పూట కూడా కూలికి పోతేనే వారికి నాలుగు వేళ్లు నోట్లోకి పోయేది. కర్నూలు, అనంతపురం, హిందూపురం జిల్లాల్లో వరుసగా కరువు రావడంతో అక్కడ బతకలేక పొట్ట చేతబట్టుకుని, మూటాముల్లు సర్దుకుని తిరుపతికి వలసొస్తుంటారు.. పంట వేయడం, పెట్టుబడి కూడా రాకపోవడం, అప్పు తీర్చుకునేందుకు వలస వెళ్లడం వీరికి షరామామూలే.

తిరుపతి వైకుంఠపురం ఆర్చి వద్ద వలస కూలీల నిరీక్షణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రభుత్వాలు కరువును పారదోలలేకపోయాయి. వరుణుని నమ్ముకుని జొన్న, సజ్జ, పత్తి, శనగ పంట వేసిన రైతులు పంట కోసం చేసిన అప్పు చేతికి రాకపోవడంతో ఊళ్లో ఉంటే చావే శరణ్యమని వృద్దులను, పిల్లలను ఇళ్ల దగ్గర వదిలేసి వలసొచ్చేశారు. మూడేళ్లుగా వీరిది ఇదే జీవన విధానం. బెంగుళూరులో ఐటి పరిశ్రమ గత కరోనా కాలం నుంచి 'వర్క్ ఫ్రం హోం' కావడంతో ఎక్కువమంది ఇళ్ల వద్దను ఐటి ఉద్యోగులు సొంతూళ్లల్లోనే పనులు చేసుకుంటున్నారు. దీంతో భవన నిర్మాణ పనులు మందగించాయి. హైదరాబాద్‌లోనూ అదే పరిస్థితి. ఇపుడిపుడే అభివృద్ధి జరుగుతున్న తిరుపతిలో భవన నిర్మాణ పనులు ఊపందుకోవడంతో రాయలసీమ పరిధిలోని కూలీలు హిందూపురం, ఉరవకొండ, ధర్మవరం, తాడిపత్రి, డోన్, ఆదోని, ఆత్మకూరు నియోజకవర్గాల నుంచి వలసొచ్చారు. భవన నిర్మాణ మేస్త్రికి రోజుకు వెయ్యి రూపాయలు కూలి దక్కుతుంది. అయితే తాము పొట్ట నింపుకునేందుకు వలస రావడంతో చులకనగా కేవలం 700 మాత్రమే చేతిలో పెడుతున్నారని వలస కార్మికులు వాపోతున్నారు. ఇటుకలు, సిమెంట్, ఇసుక మోసేందుకు సిద్ధమవుతున్నారు. తిరుపతిలోని నాలుగుకాళ్ల మండపం, ఇందిరా మైదానం, లీలామహల్ సర్కిల్, ఎంఆర్‌పల్లి సమీపంలోని వైకుంఠపురం ఆర్చి వద్ద పనుల కోసం గంటల తరబడి ఉదయం 4 గంటల నుంచే వేచి ఉంటారు. ఈ నాలుగు ప్రాంతాల్లో దాదాపు 4వేల మందిపైనే కూలీలు పనుల కోసం బిల్డర్లను, బిల్డింగ్ యజమానులను అభ్యర్థించడం 'ప్రజాశక్తి'కి కనిపించింది. మహిళకు సాధారణ డిమాండ్ రోజుకు 700. అయితే టిఫిన్, అన్నం తామే తెచ్చుకుంటామని, 500 ఇచ్చినా చాలని అభ్యర్థించడం గమనార్హం. ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకూ ఈ కూలీలు పనుల కోసం నిరీక్షిస్తూ ఉంటారు. పని దొరక్కపోతే ఇంటిమొహం పడతారు. వీరి మధ్య ఉండే పోటీతో యజమానులు అతి తక్కువ కూలికి వీరిని మాట్లాడుకుంటూ ఉంటారు.

6న టిటిడి పాలక మండలి ప్రమాణ స్వీకారం

ఒకేరోజు ఛైర్మన్ సహా 15మంది సభ్యులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక బిజెపి, టిడిపి, జనసేనతో కలిపి కొత్తగా టిటిడి పాలకకమండలి ఏర్పాటైన విషయం విదితమే. ఈనెల 6వ తేదీ బుధవారం ఉదయం 8 గంటలకు శ్రీవారి ఆలయంలో ఛైర్మన్ బి.రాజగోపాల్‌నాయుడుతో పాటు 15 మంది బోర్డు సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం అట్టహాసంగా ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చేస్తోంది. అదేరోజు మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణా, తమిళనాడు సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. టిటిడి ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఈవో శ్యామలరావు, దేవాదాయ శాఖ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, దేవాదాయ శాఖ కమిషనర్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. తుడా ఛైర్మన్ కూడా ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉంటారు. అయితే తుడా ఛైర్మన్‌ను ఇంకా కూటమి ప్రభుత్వం ప్రకటించలేదు. ప్రకటించినరోజే ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది. ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎం హాజరుకావాలని ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆహ్వానం పలికినట్లు తెలుస్తోంది. వీరిద్దరిలో ఒకరు ప్రమాణ స్వీకార మహోత్సవానికి విచ్చేస్తారని సమాచారం. కేంద్ర మంత్రి జెపి నడ్డా సైతం హాజరవుతారని తెలుస్తోంది.



పట్టుబట్టి సాధించిన భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలకమండలిని కూటమి ప్రభుత్వం బిఆర్ నాయుడుతో పాటు 24 మందిని సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జి.భానుప్రకాష్‌రెడ్డి తనదైన శైలిలో కేంద్రం నుంచి ఒత్తిడి తెచ్చి ఎట్టకేలకు బోర్డులో చోటు దక్కించుకున్నారు. నలుగురు ఎక్స్ అఫిషియో సభ్యులతో కలిపి 29 మంది కానున్నారు.

68.48 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నవంబర్ ఒకటవ తేదీ రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ జిల్లా వ్యాప్తంగా సచివాలయ సిబ్బంది ద్వారా సామాజిక పెన్షన్ దారులకు అందజేసింది. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి గుడిపాల మండలం 190 రామాపురంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,67,583 వివిధ రకాల పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. నవంబర్ మాసంలో 1,13,13 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. శుక్రవారం 1,83,251మంది పింఛన్దారులకు 8,4,332 రూపాయలను పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు పింఛన్ల పంపిణీ 68.48 పూర్తి అయింది.

బాలికల హైస్కూల్ వద్ద

రిజిస్టర్ ఆఫీస్ సమీపంలో

ఏజెఎస్ కల్యాణ మండపం సమీపం వద్ద కాలువ ఇలా..

వ్యర్థాలు తీయక.. దుర్వాసన వీడక

- నగిరిలో అడుగడుగునా అపరిశుభ్రం
- రోడ్డుపై వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే
- పరిశుభ్రత ఎరుగని అధికారులు
- పట్టణంలో జోరుగా విమర్శలు

ప్రజాశక్తి విజయపురం(నగిరి):

పట్టణాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచండని జిల్లా యంత్రాంగం పదే పదే చెబుతున్నా కింద స్థాయి అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. నగరి మున్సిపాలిటీలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఎక్కడ చూసినా చెత్త చెదారం దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు పందులు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్డుపై వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్ళవలసిన దుస్థితి ఏర్పడిందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులకు గురైన చెత్తకుండీ

స్థానికులు నిత్యం వాడే చెత్తకుండీ మరమ్మతుకు గురైంది. పట్టణ ప్రజలు వాడే పొడి, తడి చెత్తను చెత్తకుండీలో వేయాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అయితే రోడ్డుపై ఉన్న చెత్తకుండీలు మరమ్మతుకు గురికావడంతో చెత్త అంతా రోడ్డుపై వేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా చెత్తలో కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పారిశుధ్య కార్మికులు రోజు తరబడి రోజు చెత్తను తొలగించడంతో చెత్తకుండి నిండిపోతున్నాయి.

అధ్వానంగా మురికి కాలువలు

నగరి పట్టణంలో మురికి కాలువలు అధ్వానంగా ఉంది. మురికి కలువలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడ ఆగిపోయి నీరు కదలని పరిస్థితి ఏర్పడింది. రోజుల తరబడి నీరు నిలవడంతో దుర్వాసన వస్తోందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు.

నిధులు ఏమయ్యాయి

నగరి పట్టణంలో ప్రజల నుంచి వివిధ రూపంలో వసులు చేస్తే పన్ను ఏమైందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల పన్ను కట్టకపోతే అధికారులు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. అయితే పారిశుధ్యం పనిలో మాత్రం నిద్రపోతా ఉన్నారు. అసలు వివిధ పన్నుల రూపంలో వచ్చే నిధులు, పారిశుధ్యానికి వచ్చే నిధులను మున్సిపాలిటీ అధికారులు ఏం చేస్తున్నారని పలువురి నుంచి సంధిస్తున్న ప్రశ్నలు. అసలు ఖర్చు పెడుతున్నారా లేదా అని సందేహం కలగతా ఉందని పట్టణ ప్రజల ఆరోపిస్తున్నారు. ఎక్కడ చూసినా చెత్త చెదారం, మురికి కాలువలు, కదలని నీరు చూస్తూ ఉంటే నిధులు ఖర్చు చేయకుండా పక్కదారి పట్టిస్తున్నట్లు ఆనుమానం కలుగుతోందని స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని నగిరి పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

వంతెన మొదట్లో ఏర్పడ్డ భారీ గుంతలు

కూలిన పిట్టగోడ

బ్రిడ్జిపై తేలిన కమ్మీలు

దెబ్బతిన్న వంతెన.. ఎన్నాళ్లీ చింతన

- కమ్మీలు తేలిన నీవానది బ్రిడ్జి
- కూలిపోయిన పిట్టగోడ
- కనిపించని సూచిక బోర్డులు
- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని నీవానది వంతెన దెబ్బతింది. బ్రిడ్జిపై కమ్మీలు పూర్తిగా తేలిపోయి ఉన్నాయి. చిత్తూరు-పుత్తూరు ప్రధాన రహదారి కావడంతో వందలాది వాహనాలు రోజూ ఈ వంతెన మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటాయి. బ్రిడ్జి జాయింట్ల భాగంలో పూర్తిగా సిమెంటు తేలిపోయి ఉంది. కాంక్రీటు పెచ్చులు ఊడిపోయి ఉంది.

బ్రిడ్జి మొదట్లో గుంతలు..

వంతెన మొదట్లో భారీ గుంతలు ఏర్పడ్డాయి. వేగంగా వచ్చిన వాహనాలు ఒక్కసారిగా గుంతలు చూసి అదుపు చేసే క్రమంలో ప్రమాదానికి గురవుతున్నాయి. ఇటీవలే ఓ వాహనం గుంతను తప్పించబోయి వంతెన పిట్టగోడను ఢీకొంది. దీంతో ఆ గోడ కూలిపోయింది. సేఫ్టీ గోడ వద్ద కనీసం సూచికబోర్డులు కూడా లేకపోయాయి. గుంతలు, కమ్మీలు తేలిపోయి ఉండడంతో బైక్‌లు, కారులు, భారీ వాహనాలు దెబ్బతింటున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు గురై పలువురు గాయాలపాలవుతున్నారు.

సూచికలు లేని దుస్థితి..

వంతెన ఉన్నట్లు సూచికబోర్డులు కూడా లేవు. అసలే గుంతలు, అందులోనూ బ్రిడ్జి జాయింట్ భాగంలో పెచ్చులూడి ఉన్న పరిస్థితి. దెబ్బతిన్న పిట్టగోడ వద్ద ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాత్రిల్లో ప్రయాణిస్తున్న వాహన దారులకు ఇబ్బంది తప్పడం లేదు. రేడియం స్టిక్కర్లు లేకపోగా.. వంతెన పిట్టగోడ భాగంలో కనీస సూచికలు కూడా లేవు.

అధికారుల చర్యలు శూన్యం..

ప్రధాన రహదారిపై ప్రమాదపు అంచున సాగిస్తున్న ప్రయాణంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇవన్నీ అధికారులు దృష్టిలో ఉన్నాయి. అయినప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉంటున్నారని స్థానికులు మండిపడుతున్నారు. పాలకులు ఇదే మార్గంగుండా రాకపోకలు సాగిస్తున్నా కనీసం అధికారులకు ఆదేశాలు ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోకపోయారని వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేయించి కనీస సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుకుంటున్నారు.

బ్రిడ్జిపై కమ్మీలతో సమస్యగా ఉంది..

గంగాధర నెల్లూరు బ్రిడ్జిపై జాయింట్ల వద్ద సిమెంట్ కాంక్రీట్ పెచ్చులు ఊడిపోయి కమ్మీలు కనపడుతుండడం వల్ల వాహనదారులకు చాలా రోజులుగా సమస్యగా మారింది. ఈ బ్రిడ్జిపై భారీ వాహనాలు అధిక టన్నేజితో రాకపోకలు సాగించడం వల్ల రాను రాను బ్రిడ్జి డ్యామేజ్‌కు దారితీస్తుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

బి.ఏకాంబరం, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, చెర్లోపల్లి గ్రామం

బ్రిడ్జిపై రేడియం లైట్లు లేక ప్రమాదాలు

ఇడగట్టి సుధాకర్, అగర మంగళం

జీడీ నెల్లూరు - చిత్తూరు రహదారిలో బ్రిడ్జిపై రేడియం లైట్ లేకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలకు దారితీస్తున్నాయి. బ్రిడ్జికిపై భాగంలో వేల్కూరు వైపు సపోర్టు గోడ దెబ్బతింది. లారీలు బస్సుల వెలుతురులో ఈ బ్రిడ్జిపై కొత్తగా రాకపోకలు సాగించే బైక్‌లు పక్కకు వెళ్లే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులు మరమ్మతు చర్యలు తీసుకోవాలి.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కుప్పం పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి కూటమి నాయకులు ఘన నివాళులర్పించారు. అనంతరం వారు ఆంధ్రరాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు సాగించిన పోరాటాన్ని స్మరించుకుంటూ జయ జయ ధ్వానాలు వినిపించారు. కార్యక్రమంలో జిమ్ దాము, జాకీర్ అహ్మద్, శివశంకర్, శ్రీనివాసులు, మంజునాథ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను స్మరిస్తూ క్యాండిల్ ర్యాలీ

క్యాండిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పోలీసు అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా గురువారం సాయంత్రం చిత్తూరు గాంధీ సర్కిల్ వద్ద బ్యాండ్ షో, క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ఈ వారోత్సవాల్లో భాగంగా గురువారం పోలీసు బ్యాండ్ షో నిర్వహించామని తెలిపారు. తమ విధి నిర్వహణలో శాంతి భద్రతలను కాపాడుతూ ప్రాణా త్యాగాలు చేసిన పోలీసు అమరవీరులకు ప్రతీకగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించామని వివరించారు. చిత్తూరు గాంధీ కూడలి నుంచి ప్రారంభమైన క్యాండిల్ ర్యాలీ ఎంఎస్ఆర్ కూడలి చుట్టూ తిరిగి మరల గాంధీ కూడలి వద్ద ముగిసింది. పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు క్యాండిల్‌లను చేత పట్టి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. సుమారు 250 మంది పోలీసులు, హోంగార్డ్‌లు, ప్రజలతో కలిసి క్యాండిల్ ర్యాలిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ ఎస్పి ఏఆర్ఆర్ శివనంద కిషోర్, చిత్తూరు టౌన్ డిఎస్పి టి.సాయినాథ్, ఏఆర్ డిఎస్పి మహబూబ్ బాషా, 2వ పట్టణ సీఐ నెట్టికంటయ్య, వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఆర్ఐలు సుధాకర్, భాస్కర్, చంద్రశేఖర్, పట్టణ ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిపోర్టులు, ల్యాబ్ పరీక్షలు, కాన్పుల గది పరిశీలించారు. వైద్యులు, సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. హై రిస్క్ గర్భవతుల మాతా శిషు సంరక్షణ సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. జాతీయ కార్యక్రమాలు నిర్వహణ, గురించి ఆరా తీశారు. అంటు వ్యాధులు, జ్వరాల నివారణ గురించి గ్రామంలో సానిటేషన్ ఫ్రైడే డ్రైడే పాటించాలని ఆదేశించారు. ఆరోగ్య విద్య బోధించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ చంద్ర, జిల్లా ఎపి డిమాలజిస్ట్ శ్రీవాణి, సిబ్బంది అనురాధ, గోపి, జిలాని, సారామతి, మాధవి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: కరెంటు షాక్‌కు గురై భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని జంబు వారిపల్లి పంచాయతీ శాంతినగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నల్లగాంపల్లి గ్రామానికి చెందిన జానకిరామ్ శెట్టి (శ్రీనివాసరావు) శాంతినగర్లోని నూతన భవన నిర్మాణంలో విద్యుత్ పనులు చేస్తూ విద్యుత్ షాక్కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చైన్ స్నాచింగ్‌లో గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి -ఐరాల: మండలం తేనేపల్లి చెరువు వద్ద తిమ్మిరెడ్డిపల్లి నుంచి ఐరాల మండలం పుల్లూరుకు చెందిన ప్రమీల(60) కూతురు మల్లిక 26వ తేదీ శనివారం సాయంత్రం స్కూటర్లో తిమ్మిరెడ్డిపల్లికు వచ్చి స్వగ్రామం పుల్లూరుకు వెళుతుండగా తేనేపల్లి చెరువు జాతీయ రహదారిలో వీరు స్కూటర్లు వెళుతుండగా వెనక నుంచి ఇద్దరు యువకులు మాస్కులు వేసుకొని స్కూటర్లో వచ్చి వాళ్ల స్కూటర్ దగ్గరకొచ్చి పేట మిట్టకు ఎలా వెళ్లాలి అని అడగడంతో వాళ్ళు స్కూటర్ని స్లో చేశారు. దీంతో వెనక భాగంలో ఉన్న ప్రమీల మెడలో ఉన్న బంగారు చైన్‌ను యువకులు లాగారు దీంతో బంగారు చైన్‌ను ప్రమీల చేతులతో పట్టుకోవడంతో ప్రమాదవశాత్తు రోడ్డుపై పడింది చైన్ ఆ యువకులకు దొరకలేదు. దీంతో వాళ్లు పరారయ్యారు. రహదారిపై పడడంతో ప్రమీలకు తల వెనుక భాగంలో రక్త గాయం అయింది. ఆ సమయంలో రహదారిలో ఎవరూ లేరు. వెంటనే కుమార్తె మల్లిక బంధువులకు ఫోన్ చేసి 108 సహాయం ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వేలూరు సిఎంసికి వెళ్లారు. అక్కడ చికిత్స చేసుకొని మరల చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినది కేసు పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ దర్యాప్తు చేస్తున్నారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

- కేసు నమోదు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవులపల్లె గ్రామానికి చెందిన ఇరు వర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివశంకర్ తెలి పారు. రామయ్య ఫిర్యాదు మేరకు ప్రకాష్, మధు, సురేష్, భాస్కర్, అంజిలపై కేసు నమోదు చేసి నట్టు తెలిపారు. అదేవిధంగా ప్రకాష్ ఫిర్యాదు మేరకు పవన్, మనోజ్, సోమశేఖర్, టీవీ రమణ, రామయ్యలపై కేసు నమోదైనట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ.. మహిళ మృతి

ధనలక్ష్మి(ఫైల్)

ప్రజాశక్తి-కుప్పం రూరల్: అత్తింటి వేధింపులు తాళలేక గత కొద్ది రోజులకు ముందు విషం తీసుకున్న ధనలక్ష్మి తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి నగరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి తుది శ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మరణానికి ముందు బాధితురాలు మాట్లాడుతూ తన చావుకు అత్తింటివారి వేధింపులే కారణమని, తాను ఆడబిడ్డకు జన్మనిచ్చిన కారణంగా భర్త, అత్తమామలు, ఆడపడుచు 25లక్షల రూపాయలు వారికి చెల్లించడంతో పాటు తన భర్త అయిన సంతోష్‌కు విడాకులు సైతం ఇవ్వాలని ప్రతి రోజు చిత్రహింసలకు గురి చేసినట్లు బాధితురాలు తెలిపిందన్నారు. వారి చిత్రహింసలు భరించలేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డట్టు బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమార్తె చావుకు అత్తింటివారే కారణమని మరణించే ముందు తన కుమార్తె చెప్పిన మాటలు వీడియో సాక్ష్యం ఉందని, దానిని మరణ వాంగ్మూలంగా భావించి, దోషులను కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఈ విషయాలను తెలియజేస్తూ కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయమై కుప్పం పోలీసులు మృతురాలి అత్తింటి వారిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మరిన్ని వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

టీటీడీ పాలకమండలి సభ్యునిగా శాంతారామ్

శాంతారామ్‌ను సన్మానిస్తున్న నాయకులు

అభినందనలు తెలిపిన నాయకులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: టీటీడీ పాలకమండలి సభ్యునిగా కుప్పం మండలం వాసనాడు గొల్లపల్లి గ్రామానికి చెందిన శాంతారామ్‌కు అవకాశం కల్పించడంపై తోటి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, సీఎం వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి అంకిత భావంతో పార్టీ బలోపేతానికి పనిచేస్తున్న వ్యక్తిని గుర్తించి సముచితస్థానం కల్పించడంపై తోటి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున అభినందనలు తెలియజేస్తూ, సన్మానించారు. అనంతరం శాంతారామ్ స్పందిస్తూ ముందుగా సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అధినేత ప్రకటించినట్టు టిడిపిలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందనడానికి ఇదే నిదర్శనం అన్నారు. ముఖ్యంగా ప్రతి దేవాలయ కమిటీలో నాయి బ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తామని సీఎం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. టీటీడీ పాలకమండలి సభ్యునిగా తనకు అవకాశం కల్పించి, తిరుమల శ్రీవారి సేవ చేసుకునే భాగ్యం తనకు కల్పించడంపై ఆనందం వ్యక్తం చేశారు. టీటీడీ కీర్తి ప్రతిష్టలను కాపాడేలా పనిచేస్తానని తెలిపారు.

పేదల సౌకర్యార్థమే నూతన బస్సులు

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పేదలను దృష్టిలో ఉంచుకొని అన్ని డిపోల్లో కొత్త సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. చిత్తూరు టు డిపోలో 10 నూతన సర్వీసులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే కాలంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా విద్యుత్‌తో నడిపే ఎలక్ట్రికల్ బస్సులను నడిపేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంను త్వరలో అమలు, ఏపీఎస్ఆర్టీసీ సంబంధించిన కార్మికుల సంక్షేమం తద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశముందన్నారు. ప్రభుత్వానికి కార్మికులు, ప్రయాణికులు రెండు కళ్ళు రాబోయే కాలంలో ఏపీఎస్ఆర్టీసీని సంరక్షించుకొంటామన్నారు. తప్పకుండా కార్మికులకు ప్రయాణికులకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రికి విన్నపం

ప్రజాశక్తి-గుడిపాల: గుడిపాల మండల కేంద్రంలోని నరహరిపేట ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సమయానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయవలసిందిగా ఆ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఢిల్లీ బాయ్ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే జగన్మోహన్‌ను కోరారు. ఈ పాఠశాల నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులకు బస్సు సాయంత్రం 6గంటలకు వస్తుందని సాయంత్రం నాలుగు గంటలకు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని వారు విన్నవించగా స్పందించిన మంత్రి వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సిందిగా డిపో మేనేజర్‌కు ఆదేశించారు. మంత్రికి స్కూల్ కమిటీ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.

వీఆర్‌వోకు సన్మానం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని పెరుమా ళ్లపల్లె వీఆర్‌వోగా నరసింహ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన కార్వేటినగరం మండలంలో కత్తెరపల్లి వీఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. పలువురు అభినంది ంచారు. దుశ్శాలువాలతో సన్మానిం చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉన్నారు.

కళ్యాణ మండపం నిర్మాణానికి విరాళం



ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమలలోని స్వయంబీస్వర స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న కళ్యాణ మండపం నిర్మాణానికి సోమల గ్రామానికి చెందిన రాగ్గారి ఉమా శంకర్, తేజో రాణి దంపతులు 15,116 రూపాయలు విరాళాన్ని అందజేసినట్టు ఆలయ ధర్మకర్త బివి సోమశేఖర్ తెలిపారు. పారపట్ల మహేష్, రేవతి దంపతులు 5,116 రూపాయలు విరాళంగా అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ముని శర్వాణ్, లింగన్న, పూజారి విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రాధాకృష్ణ బాధ్యతలు

బాధ్యతలు స్వీకరిస్తున్న రాధాకృష్ణ

ప్రజాశక్తి-గుడిపల్లి: మండల ఎంపీడీవోగా రాధాకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను రామకుప్పం మండలం ఈవోపీఆర్‌డీగా, బిఎల్ఒపిగా బాధ్యతలు నిర్వహించారు. అదనపు బాధ్యతల్లో భాగంగా గుడిపల్లి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఉన్న ఎంపీడీవో మదనపల్లికి బదిలీ కావడంతో ఈయన ఇక్కడికి నియమితులైయ్యారు.

శిథిలావస్థలో ఉన్న ట్యాంకు

ఊరి ట్యాంకు శిథిలావస్థ.. అధికారులు నిద్రావస్థ

- పరిశుభ్రతకు నోచుకోని నీటి ట్యాంకు
- అనారోగ్యం పాలవుతున్న కాలనీ వాసులు

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని కేశవపురం ఆదిఆంధ్రవాడలో ఉన్న ఓవర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో నీరు ఓవర్ ట్యాంక్‌లో నిలవడం లేదు. నీరు వృధాగా పోతోంది. ఓవర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి 30ఏళ్లు అయింది. ఇంతవరకు వాటిని కడిగిన పాపాన పోలేదని స్థానికులంటున్నారు. అంతేకాకుండా ఓవర్ ట్యాంక్ చుట్టూ పాచ్చిపట్టి అధ్వానంగా ఉంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వృధాగా పోతున్న నీరు

తాగునీటి ఎద్దడి లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఆ నీటిని వృధా కాకుండా చూసుకోవలసిన బాధ్యత వారిదే అని జిల్లా యంత్రాంగం పదే పదే చెబుతున్న మండల స్థాయి అధికారులు వాటిని ఏమాత్రం పాటించడం లేదు. కేశవపురం ఆది ఆంధ్రవాడలో ఓవర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకొని తాగునీరు వృధాగా పోతున్నా.. విషయం మండల స్థాయి అధికారులకు తెలిసిన వాటిని ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో పలుమార్లు అర్జీలు ఇచ్చిన అధికారులు పట్టించుకోవడం లేదని అక్కడి గ్రామస్తులంటున్నారు.

తాగునీటికి కట కట

విద్యుత్ లేని సమయంలో తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకే ఓవర్ ట్యాంకులు నిర్మిస్తారు. అయితే కేశపురం ఆదిఆంధ్రవాడలో నిర్మించిన ఓవర్ ట్యాంక్ మరమ్మతుకు గురి కావడంతో నీరు నిలవడం లేదు. ఫలితంగా తాగునీరు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు స్థానికంగా ఉన్న బావిలో నీటిని తాగవలసిన పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు దీనిపై స్పందించి చర్యలు తీసుకొని ఓవర్ ట్యాంకును శుభ్రం చేయాలని కాలనీ వాసులు కోరుకుంటున్నారు.

పాచిపట్టిపోయి ఉన్న ట్యాంకు

కార్యశాల ప్రారంభం

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ద్రావిడ విశ్వవిద్యాలయంలో శుక్రవారం శాస్త్రీయ, సాంకేతిక పరిభాష నిఘంటువుల నిర్మాణ కార్యాశాల ప్రారంభించారు. సంగణక, భాషాశాస్త్ర విభాగం రాజనీతి శాస్త్రం సంబంధించి తెలుగు, తమిళం, కన్నడ పారిభాషా పదజాల నిఘంటువులు తయారు చేయడానికి ప్రారంభించిన కార్యలశాల ఈనెల 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య కేశవమూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ కమీషన్ ఫర్ సైంటిఫిక్, టెక్నికల్ టెర్మినాలజీ అన్ని భారతీయ భాషలలో సాంకేతిక పరిభాషను అభివృద్ధి చేసే లక్ష్యంతో స్థాపించబడిందని, ప్రస్తుతం కమీషన్ ఫర్ సైంటిఫిక్, టెక్నికల్ టెర్మినాలజీ న్యూఢిల్లీలో ప్రధాన కార్యాలయంతో భారత ప్రభుత్వంలోని ఉన్నత విద్యా శాఖ, విద్యా మంత్రిత్వ శాఖ క్రింద పనిచేస్తుందని తెలిపారు. ఇరవై రెండు రాష్ట్ర గ్రంథ అకాడెమీలు, రాష్ట్ర టెక్స్ట్-బుక్ బోర్డులు విశ్వవిద్యాలయాల శాఖలు మొదలైనవి కూడా ఈ కమిషన్ తో అనుబంధించబడి కమీషన్ ద్వారా రూపొందించబడిన ప్రామాణిక పదజాలంతో హిందీ, ఇతర భారతీయ భాషలలో విశ్వవిద్యాలయ స్థాయి టెక్స్ట్-బుక్స్ / రిఫరెన్స్ మెటీరియల్లను రూపొందించడానికి ఈ ప్రభుత్వ సంస్థ పూనుకున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు, కమీషన్ వివిధ సబ్జెక్టులు, వివిధ భాషలలో దాదాపు తొమ్మిది లక్షల సాంకేతిక పదాల పదజాలాన్ని ప్రామాణికం చేసిందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య కిరణ్ కుమార్, డీన్ ఆచార్య కేశవమూర్తి, శాఖాధ్యక్షులు ఆచార్య గణేశన్ అంబేద్కర్, కమీషన్ ఫర్ సైంటిఫిక్, టెక్నికల్ టెర్మినాలజీ డిప్యూటీ డైరెక్టర్ డా. మహ్మద్ అన్సారీ షెహజాద్, వివిధ భాషల నిపుణులు, రాజనీతి శాస్త్ర నిపుణులు పాల్గొన్నారు.

వేగంగా సీసీ రోడ్డు నిర్మాణం

సీసీ రోడ్లు పనులు పరిశీలిస్తున్న కిషోర్ గౌడ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని దేవదొడ్డి పంచాయతీ కుటవలవంక గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు బీఎం కిషోర్ గౌడ్ సీసీరోడ్డుకి భూమి పూజ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సుబ్రమన్యం శెట్టి, తెలుగు యువత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాడ వాడలా దీపావళి సంబరాలు



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: దీపావళి సంబరాలు గురు, శుక్రవారాలలో వాడ వాడలా ఆనందంగా ఆహ్లాదకరంగా నిర్వహించుకున్నారు. గురువారం టపాకాయలు పేల్చి నరక చతుర్దశికి జరుపుకున్నారు. శుక్రవారం భక్తిశ్రద్ధలతో కేదార గౌరీ వ్రతం చేపట్టారు.

కలెక్టరేట్లో భారత ఐక్యత దినోత్సవం



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: భారత ఐక్యత దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టర్ ఆఫీసులో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్తూరు జిల్లా పర్యాటక, సంస్కృతి అధికారి ఎస్ మల్లికార్జున మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా దేశ ఐక్యత కోసం సమగ్రత కోసం పాటుపడిన స్వాతంత్ర సమరయోధుడు అలాగే గొప్ప న్యాయవేత్త అతని చరిత్రను ప్రతి విద్యార్థి కూడా తెలుసుకోవాలి అని పేర్కొన్నారు.

బెయిల్ కోసం డీఎస్పీ ఆఫీస్‌కు ఎంపీ

ప్రజాశక్తి-పలమనేరు: పుంగనూరు ఘటనలో షరతులతో కూడిన బెయిల్ విషయంగా ఎంపీ మిథున్‌రెడ్డి శుక్రవారం పలమనేరు డీఎస్పీ కార్యాలయానికి విచ్చేశారు. ఆయన వెంట జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ తదితరులు ఉన్నారు.